క్లుప్తంగా

సచివాలయం తనిఖీ

హనుమంతునిపాడు: లింగంగుంట్ల గ్రామ సచివాలయాన్ని ఎంపీడీఓ క్రిష్టారావు గురువారం అకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బంది బయోమెట్రిక్ హాజర్, వివిధ సంక్షేమ పథకాలకు సంబంధించిన రికార్డులు, పింఛన్ లబ్ధిదారుల రికార్డులు, హాజరు రికార్డులు పరిశీలించారు. సిబ్బంది అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరించాలన్నారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

కూలీల హాజరు శాతం పెంచండి

జరుగుమల్లి (సింగరాయకొండ): ఉపాధి హామీ పథకం కూలీల హాజరు శాతాన్ని పెంచేలా ఫీల్డ్ అసిస్టెంట్లు కృషి చేయాలని ఎంపీడీఓ పి. రామకృష్ణ సూచించారు. కామేపల్లి పంచాయతీలో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను గురువారం పరిశీలించారు. పనిప్రదేశంలో అన్ని రకాల వసతులు కల్పించాలని ఆదేశించారు.

దివ్యాంగుల పాఠశాలకు ఆర్థికసాయం

కందుకూరు రూరల్: లింగసముద్రం గ్రామానికి పూరిమిట్ల కోటయ్య ప్రథమ వర్ధంతిని పురస్కరించుకుని కుటుంబసభ్యులు కోవూరు రోడ్డుని స్వర్ణ స్వయంకృషి దివ్యాంగుల పాఠశాలకు రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు. 125 కేజీల బియ్యాన్ని, ఇతర వస్తువులను అందించారు. కోటయ్య కుమారులు గోపీ, శ్రావణ్, ప్రశాంత్, చిన్నరాయుడు, కుమార్తె చైతన్య, అల్లుడు లక్ష్మీనరసింహం పాల్గొన్నారు.

ముగిసిన ఎన్‌ఎస్‌ఎస్ క్యాంపు

కందుకూరు రూరల్: మండలంలోని పలుకూరులో వైఎస్సార్ ఉద్యాన కళాశాల ఆధ్వర్యంలో వారం రోజులుగా నిర్వహిస్తున్న ఎన్‌ఎస్‌ఎస్ క్యాంపు గురువారంతో ముగిసిందని కళాశాల అసోసియేట్ డీన్ విజయపద్మ తెలిపారు. చివరి రోజు గ్రామంలోని రైతుల పంట పొలాలను సందర్శించారు. వారం రోజుల విద్యార్థులు గ్రామంలో పర్యటించి సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఇటువంటి క్యాంపులు విద్యార్థుల్లో సేవా దృక్పథాన్ని అలవరుస్తాయని వివరించారు. ఇన్‌చార్జి అసోసియేట్ డీన్ విజయభాస్కర్, సర్పంచ్ వీరమల్లు శ్రీను, ఎంపీటీసీ పున్నయ్య పాల్గొన్నారు.

సేవల ద్వారా ఆదాయం పెంచండి

జరుగుమల్లి (సింగరాయకొండ): గ్రామ పంచాయతీల్లో ఇచ్చిన లక్ష్యాల ప్రకారం సేవల ద్వారా పంచాయతీ ఆదాయాన్ని పెంచి ప్రభుత్వానికి సహకరించాలని ఎంపీడీఓ పి. రామకృష్ణ గ్రామ సచివాలయ సిబ్బందికి సూచించారు. సచివాలయాన్ని గురువారం తనిఖీ చేసి సిబ్బందితో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఎంపీడీఓ రామకృష్ణ మాట్లాడుతూ ఆయుష్మాన్ భవ కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలన్నారు. కార్యదర్శి పి. అశోక్, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు హుండీ లెక్కింపు

వలేటివారిపాలెం: మండలంలోని మాలకొండ మాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం 16 వారాల హుండీ లెక్కింపు శుక్రవారం నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి కేబీ శ్రీనివాసరావు తెలిపారు. కొండ మీద ఉన్న కల్యాణ మండపంలో హుండీ లెక్కింపు ఉంటుందన్నారు.

విద్యుత్ పనులు పూర్తి

గుడ్లూరు: మండలంలోని తెట్టు–రామాయపట్నం గ్రామాల మధ్య రామాయపట్నం పోర్టు నిర్వాసితులకు నిర్మిస్తున్న ఆర్‌ఆర్ కాలనీలో విద్యుత్ పనులు పూర్తయినట్లు విద్యుత్ శాఖ డీఈఈ విజయబాబు అన్నారు. ఆర్‌ఆర్ కాలనీలో విద్యుత్ పోల్ నిర్మాణాల పనులను ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోర్టు నిర్మాణంతో నిర్వాసితులైన మొండివారిపాలెం గ్రామస్తులకు ఆర్‌ఆర్ కాలనీలో వారు నిర్మించుకుంటున్న గృహాలకు విద్యుత్ సరఫరా అందించామన్నారు. అలాగే మరో నిర్వాసిత గ్రామం ఆవులవారిపాలెం గ్రామస్తులు కూడా త్వరలో ఆర్‌ఆర్ కాలనీలో గృహనిర్మాణాలు చేపడుతున్నందున వారికి వారికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా అక్కడ 70 పోల్స్ ఏర్పాటు చేసి విద్యుత్ తీగలు లాగి బల్బులు అమర్చామన్నారు. దీంతో రెండు కాలనీలలో విద్యుత్ పనులు పూర్తి అయ్యాయన్నారు. ప్రస్తుతం రెండు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశామని త్వరలో, మరో నాలుగు ఏర్పాటు చేస్తామని ఆయన తెలిపారు. ఆయన వెంట ఏఈ శ్రీనివాసరావు ఉన్నారు.

స్పీకర్లకు అనుమతి తప్పనిసరి

మద్రిపూడి: ఈ నెల 6న జరగనున్న శ్రీ పృధులగిరి లక్ష్మీనృసింహస్వామి తిరునాళ్లలో ఎలాంటి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలన్నా పోలీసుల అనుమతి తప్పనిసరిగా ఉండాలని కొండపి సీఐ ఎం. శ్రీనివాసరావు అన్నారు. మద్రిపూడి నుంచి పృధులగిరి కొండకు వెళ్లే రహదారిని ఆయన గురువారం పరిశీలించారు. అనంతరం స్థానిక పోలీస్ స్టేషన్‌లో మాట్లాడుతూ తిరునాళ్లలో అసాంఘిక కార్యక్రమాలకు చోటులేదన్నారు. లౌడ్ స్పీకర్ల పర్మిషన్ కోసం అనుమతి తీసుకోవాలన్నారు.



ఎంఐజీ లేఅవుట్‌లో జరుగుతున్న ఓవర్ హెట్ ట్యాంక్ నిర్మాణ పనులు



లేఅవుట్‌లో జరుగుతున్న డ్రైనేజీ పనులు

శరవేగంగా ఎంఐజీ లే అవుట్

- పట్టణానికి అతి దగ్గరలో 25.5 ఎకరాల విస్తీర్ణంలో..
- మధ్య తరగతి ప్రజలకు వరం
- చిన్న ప్రభుత్వ ఉద్యోగులూ అర్హులే

కందుకూరు అర్బన్: మధ్య తరగతి ప్రజల ఏళ్ల నాటి సొంతింటి కలను సాకారం చేసేందుకు కందుకూరు పట్టణం ఉప్పుచెరువులో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఎంఐజీ లేఅవుట్ అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి పట్టణానికి అతి దగ్గరగా ఉన్న ఉప్పుచెరువులోని ప్రభుత్వ స్థలంలో 25.5 ఎకరాలను కేటాయించారు. అందులో హుడా ఆధ్వర్యంలో మున్సిపాలిటీ అధికారులు 292 ప్లాట్లతో ఎంఐజీ లేఅవుట్‌ను ఏర్పాటు చేశారు. నిర్ణీత ధరతో 3 కేటగిరీలుగా విభజించి 150, 200, 240 చదరపు గజాల విస్తీర్ణంలో ప్లాట్లు నిర్మిస్తున్నారు. కుల, మతాలకు అతీతంగా రూ.18 లక్షల లోపు వార్షిక ఆదాయం కలిగిన మధ్య తరగతి వర్గాల ప్రజలను, చిన్న చిన్న ఉద్యోగులను కూడా అర్హులుగా చేర్చారు. ఎంఐజీ లేఅవుట్‌లో ఇళ్లను పొందాలనుకునే వారు తమ పేరుపై ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునే అవకాశం కల్పించారు. ఆన్‌లైన్ ద్వారా ఇంటి స్థలాల కేటాయింపులు జరుగుతాయని, మూడు విడతలుగా వాయిదాలలో డబ్బులు చెల్లించాలని అధికారులు పేర్కొంటున్నారు.

చకా చకా పనులు

కందుకూరు పట్టణానికే తలమానికంగా ఎంఐజీ లే అవుట్‌ను తీర్చిదిద్దేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఎంఐజీ లేఅవుట్‌లో అంతర్గత డ్రైనేజీలు, తాగునీరు పైపులైన్లు, సీసీరోడ్లు, గ్రీనరీ, విద్యుత్ సౌకర్యం, ఎంఐజీ లేఅవుట్ చుట్టూ ప్రహరీ వంటి వసతులను ఏర్పాటు చేస్తున్నారు. ప్రస్తుతం రోడ్లు, అంతర్గత డ్రైనేజీ నిర్మాణ పనులు, ఎంఐజీ లేఅవుట్‌కు తాగునీటిని సరఫరా చేసే ఓవర్ హెడ్ ట్యాంకు పనులు జరుగుతున్నాయి, ఎటువంటి లిటికేషన్ లేకుండా ఇళ్లు నిర్మించి రిజిస్ట్రేషన్ చేసి లబ్ధిదారులకు అప్పగిస్తామని కమిషనర్ ఎస్. మనోహర్ తెలిపారు. ఎంఐజీ లేఅవుట్‌కు ఇళ్లను పొందాలనుకునే వారు ఆన్‌లైన్‌లో తమ పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

నూరుశాతం పన్నులు వసూలు చేయాలి

వలేటివారిపాలెం: ఇంటిపన్నులు నూరుశాతం వసూలు చేయాలని కందుకూరు డివిజనల్ పంచాయతీ అధికారి కృష్ణమోహన్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. ఎంపీడీఓ షేక్ రఫీక్‌అహ్మద్ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న డివిజనల్ పంచాయతీ అధికారి కృష్ణమోహన్ మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. వేసవిలో ప్రజలకు నీటి సమస్య లేకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలన్నారు. నీటి సమస్యపై ఎటువంటి ఫిర్యాదులు రాకూడదన్నారు. ఈఓపీఆర్‌డీ మాధవి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పంచాయతీ అధికారి కృష్ణమోహన్

భ్రూణ హత్యలు నివారించాలి

కందుకూరు: భ్రూణ హత్యలు నివారించేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ ప్రియంవద అన్నారు. బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా గురువారం పట్టణంలోని కేజీబీవీ పాఠశాలలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరి జీవితంలో ఆనందానికి కారణం ఆడ పిల్లలే అని, ప్రకృతి ప్రసాదించిన వరప్రసాదం లాంటి వారని వివరించారు. అలాగే మగ పిల్లలతో సమానంగా ఆడ పిల్లలను ఆదరించాలన్నారు. నేడు అన్ని రంగాల్లోనూ మగ పిల్లల కంటే ఆడ పిల్లలే మెరుగ్గా రాణిస్తున్నారన్నారు. భ్రూణ హత్యలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం చట్టరీత్యా నేరమన్నారు. ఇటువంటి నేరాలకు పాల్పడే వారిని ప్రభుత్వ చట్టాల ప్రకారం కఠిన శిక్షలు విధిస్తామని తెలిపారు. బాలుర ఉన్నత పాఠశాల హెచ్‌ఎం అనూరాధ మాట్లాడుతూ సమాజంలో బాలికల హక్కులు, సంరక్షణ గురించి తెలుసుకోవాలన్నారు. మగ పిల్లలతో సమాన హక్కులు ఆడ పిల్లలకు ఉన్నాయని, బాలురు సమానంగా చదువుకుని జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరాలని ఆకాంక్షించారు. అర్బన్‌హెల్త్ సెంటర్ వైద్యాధికారి డాక్టర్ బ్యూలాగ్రేస్ మాట్లాడుతూ పిల్లలు చిన్నతనం నుంచి ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలన్నారు. కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ స్వాతి, ఐసీడీఎస్ సీడీపీఓ అంజమ్మ, హెచ్‌ఎం శ్రీనివాసరావు, కె.పద్మావతి పాల్గొన్నారు.



ప్రదర్శన నిర్వహిస్తున్న విద్యార్థులు, అధికారులు

అధికారులపై సభ్యుల ధ్వజం

- విద్యుత్ శాఖలో అవినీతి రాజ్యమేలుతోంది
- మండల సమావేశానికి పలు శాఖల అధికారుల గైర్హాజరు

కనిగిరి రూరల్: మీరు చేసే తప్పిదాల వల్ల ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తోంది..క్షేత్రస్థాయిలో ఎందుకు తిరగడం లేదు..పథకాలు ప్రజలకు ఎందుకు చెప్పడం లేదు అంటూ మండల సమావేశంలో పలువురు సభ్యులు ధ్వజమెత్తారు. స్థానిక మండల పరిషత్ సమావేశం ఎంపీపీ దంతులూరి ప్రకాశం అధ్యక్షతన గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీటీసీలు కోటమ్మ, అట్లారామచంద్రారెడ్డి, రమణారెడ్డి, తిరుపతిరెడ్డిలు మాట్లాడుతూ మీరు క్షేత్ర స్థాయిలో పర్యటించకుండా పంట నష్టపరిహార నివేదికలు ఇవ్వడం వల్లే అనేక మంది రైతులకు పరిహారం అందక నష్టపోయారని.. మీరు చేసిన పని గ్రామాల్లో రైతుల వద్ద తాము మాటలు పడాల్సి వస్తోందని వ్యవసాయ అధికారిపై ధ్వజమెత్తారు. విద్యుత్ శాఖలో తీవ్ర అవినీతి జరుగుతుందని వైస్ ఎంపీపీ తిరుపతిరెడ్డి, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు కాసుల గురవయ్యలు ధ్వజమెత్తారు. కనీసం స్తంభం మార్చాలంటే రూ.5 నుంచి 20 వేలు లంచం అడుగుతున్నారని, డబ్బులు ఇవ్వక పోతే నిబంధనల పేరుతో ఇబ్బందులు పెడుతున్నారని ,ధ్వజమెత్తారు. గ్రామాల్లో ఎల్‌ఎంలు తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఎంపీటీసీలు కోటమ్మ, రామచంద్రారెడ్డి, రమణారెడ్డిలు తీవ్రంగా మండిపడ్డారు. పునుగోడు లైన్‌మెన్ తీవ్ర నిర్లక్ష్యంగా ఉన్నాడని వైస్ ఎంపీపీ తిరుపతిరెడ్డి ధ్వజమెత్తారు. దీంతో స్పందించిన విద్యుత్ ఇన్స్‌పెక్టర్ వెంకటేశ్వర్లు సమస్యను ఉన్నతాధికారులకు వివరిస్తానని చెప్పారు. మత్స్యశాఖ ఇన్‌స్పెక్టర్ రాము మాట్లాడుతూ నియోజకవర్గంలో 64 చెరువులకు ఈ ఏడాది ఫసలీలో చేపలు పట్టేందుకు ఎవరి అనుమతులు ఇవ్వలేదని చెప్పారు. ఆయా పంచాయతీల కార్యదర్శులకు నోటీసులు జారీ చేశామన్నారు. ఎవరైన చేపలు పడుతున్నట్లు తమ దృష్టికి తీసుకువస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పలు శాఖల అధికారులు గైర్హాజరయ్యారు. ప్రజా పంపిణీ వ్యవస్థ, రెవెన్యూ శాఖల అధికారుల గైర్హాజరుపై సభ్యులు ప్రశ్నించారు.


పథకాలను క్షేత్ర స్థాయిలోకి తీసుకెళ్లాలి

ప్రభుత్వాధికారులు పథకాలను క్షేత్ర స్థాయిలో పర్యటించి సభలు, సమావేశాలు నిర్వహించి ప్రజల దరి చేర్చాలని ఎంపీపీ దంతులూరి ప్రకాశం అన్నారు. అధికారులు అలసత్వంగా వ్యవహరించడం వల్ల లబ్ధిదారులు నష్టపోతున్నారన్నారు. నష్టపరిహారం నివేదికల తయారీలో గ్రామాల్లోకి వెళ్లి రైతులతో సమావేశం నిర్వహించాలని ఏఓను ఆదేశించారు. ఎంపీడీఓ జేవీబీ మల్లికార్జున, వైస్ ఎంపీపీలు గాలిబోయిన ధనుంజయ్, తిరుపతిరెడ్డి, సొసైటీ అధ్యక్షుడు సంగు సుబ్బారెడ్డి, కాసుల గురవయ్య, అట్లా రామచంద్రారెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ దంతులూరి ప్రకాశం

ఆలయంలో విశిష్ట పూజలు



ప్రత్యేక పూజల్లో అడిషనల్ ఎస్పీ, మాజీ ఎంపీపీ

కనిగిరి రూరల్: పట్టణంలోని కేటీఆర్ స్కూల్ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో జరుగుతున్న విగ్రహ ప్రతిష్టా మహోత్సవాల్లో గురువారం విశిష్ట పూజలు జరిగాయి. అభిషేకాలు కేటీఆర్ విద్యా సంస్థల అధినేత, ఆలయ ధర్మకర్త కుందురు తిరుపతిరెడ్డి శారద దంపతుల ఆధ్వర్యంలో ఎంతో భక్తి శ్రద్ధలతో జరిగాయి. అనంతరం దేవస్థానాన్ని అడిషనల్ ఎస్పీ నాగేశ్వరరావు సందర్శించి, ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ పాతు కొండారెడ్డిని, బ్రహ్మణ సంఘ అధ్యక్షులు, న్యాయవాది ఎం సుబ్రహ్మణ్యంను ఆలయ కమిటీ ఘనంగా సన్మానించారు.

ముమ్మరంగా ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం



ఓట్లు అభ్యర్థిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

పామూరు: వైఎస్సార్ సీపీ బలపరిచిన పట్టభద్రుల అభ్యర్థిగా పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి, ఉపాధ్యాయుల అభ్యర్థిగా పర్వతనేని చంద్రశేఖర్‌రెడ్డిలకు ప్రథమ ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరుతూ జెడ్పీటీసీ చప్పిడి సుబ్బయ్య, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గంగసాని హుసేన్‌రెడ్డి ఆధ్వర్యంలో ముమ్మర ప్రచారం నిర్వహించారు. వైస్ ఎంపీపీ రషీద్, యాదాల సాయికిరణ్, కో ఆప్షన్ నాయబ్‌రసూల్, మాజీ వైస్ ఎంపీపీ పువ్వాడి రాంబాబు, పట్టణ అధ్యక్షుడు చాంద్‌బాషా, గుర్రం వెంకటేశ్వర్లు, ఎంపీటీ నాయబ్‌రసూల్ పాల్గొన్నారు.

పాఠశాల ఆకస్మిక తనిఖీ

హనుమంతునిపాడు: మండలంలోని రక్షణాపురం ప్రాథమిక పాఠశాలను గురువారం ఎంఈఓ జి.పెద్దిరాజు ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల హాజర్, రోలు, ఉపాధ్యాయుల హాజర్ రికార్డులు, మధ్యాహ్న భోజన నిర్వహణ రికార్డులు పరిశీలించారు. మధ్యాహ్న భోజనం పరిశీలించి తిని రుచి చూచారు. మధ్యాహ్న భోజనంలో మెనూ తప్పక పాటించాలన్నారు. మెనూ అమలు చేయకుండా చర్యలు తప్పవని హెచ్చరించారు. వంటశాలను పరిశుభ్రంగా ఉంచాలని కుకింగ్ ఏజెన్సీలకు సూచించారు.

వైఎస్సార్ పింఛన్ కానుక వరం

సీఎస్‌పురం: అవ్వా తాతలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన వరం వైఎస్సార్ పింఛన్ కానుక అని జెడ్పీటీసీ మేకల శ్రీనివాసులు అన్నారు. మండలంలోని ఉప్పలపాడు పంచాయతీలో వైఎస్సార్ పింఛన్ కానుక నగదు పంపిణీలో ఆయన మాట్లాడారు. అర్హులందరికీ పార్టీలకతీతంగా పింఛన్లు అందజేస్తున్న ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. సర్పంచ్ యంబడి ప్రవీణ్‌కుమార్, వైఎస్సార్ సీపీ నాయకుడు పాలుగుళ్ల రత్నారెడ్డి, బొర్రాజు రమణయ్య పాల్గొన్నారు.

15 రోజుల పాటు నీటి విడుదల

పామూరు: పామూరుకు చెందిన పాతచెరువు నీటిని ఆయకట్టు పరిధిలో సాగు చేసిన పొగాకుకు 15 రోజుల పాటు నీరు విడుదల చేస్తున్నట్లు ఇరిగేషన్ ఏఈ శ్రీనివాసులు తెలిపారు. గత కొన్ని రోజులుగా నీటి విడుదలపై ఆయకట్టు పరిధిలోని రైతులు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో పొగాకు పైరు ఎండిపోకుండా ఆరుతడిగా నీటిని ఇచ్చేందుకు నిర్ణయించి నీటిని విడుదల చేసినట్లు తెలిపారు. రైతులు సాగుకు అవసరమైన నీటిని వాడుకుని వృథా కాకుండా చూడాలన్నారు.

వార్డుల్లో పర్యటించిన చైర్మన్ గఫార్

కనిగిరి రూరల్: దశల వారీగా అన్ని వార్డుల్లో మౌలిక వసతులు కల్పిస్తానని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. పట్టణంలోని 9వ వార్డులోని వాల్మీకి వీధిలో సమస్య– పరిష్కారంలో భాగంగా పర్యటించారు. వార్డుల్లోని ప్రజలు వివిధ సమస్యలను చైర్మన్ గఫార్‌కు విన్నవించారు. పారిశుధ్య పనుల తక్షణ నిర్వహణకు చైర్మన్ గఫార్ శానిటరీ, మున్సిపల్ సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ చొప్పరపు తిరుపతయ్య, నాయకులు డాక్టర్ నాయబ్ రసూల్, నాగూర్‌వలి, నాగూర్‌బీ, రహిమాన్, భారతీ, శానిటరీ సెక్రటరీ లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి


కనిగిరి రూరల్: విద్యార్థులు క్రమశిక్షణతో ఉన్నత స్థాయికి ఎదగాలని ఎంఈఓ జె.ప్రసాద్‌రావు అన్నారు. మండలంలోని పాతపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం వీడ్కోలు, వార్షికోత్సవ సభ నిర్వహించారు. ఎంపీటీసీ అట్లా రామచంద్రారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన, మెరుగైన విద్య లభిస్తోందన్నారు. ప్రతి విద్యార్థి లక్ష్య సాధన దిశగా ముందడుగు వేసి ఉన్నత విజయాలు సాధించాలన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి.

గెలుపే లక్ష్యంగా పనిచేద్దాం

హనుమంతునిపాడు:

- పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యామ్ ప్రసాద్‌రెడ్డి,
- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి

గెలుపే లక్ష్యంగా పని చేయాలని మాజీ ఎంపీపీ గాయం బలరామిరెడ్డి, మండల పార్టీ కన్వీనర్ యక్కంటి శ్రీనివాసులరెడ్డి అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్సీ ఎన్నికలపై గురువారం సమీక్ష నిర్వహించారు. మండలంలో ఎమ్మెల్సీ ఎన్నికల్లో మన పార్టీ అభ్యర్థికి అధిక మెజార్టీ ఓట్లు వచ్చేందుకు మనమంతా కష్టపడి పని చేయాలన్నారు. గ్రామంలో వార్డుల వారీగా ఓటర్ల జాబితాను పరిశీలించి ప్రతి ఓటరును కలిసి ఓటు వేయించాలన్నారు. అనంతరం మండలంలో ఎమ్మెల్సీ ఓట్ల ప్రచారం నిర్వహించారు. పార్టీ మండల కన్వీనర్ యక్కంటి శ్రీనివాసులరెడ్డి, యూత్ అధ్యక్షుడు భవనం క్రిష్టారెడ్డి, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు బత్తుల శ్రీనివాసులరెడ్డి, కోటపాటి మోహన్‌రెడ్డి, ఆదినారాయణరెడ్డి, గాండ్లపర్తి వెంకటేశ్వర్‌రెడ్డి, చెక్కా రాముడు, కస్తాల బాలాజీ, ఊట తిరుపతరెడ్డి ఎం వెంకటేశ్వర్‌రెడ్డి, పల్లపోలు శ్రీనివాసులరెడ్డి, రైతు సంఘ మండల అధ్యక్షుడు శ్యామల సాంబిరెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎంపీపీ గాయం బలరామిరెడ్డి

పార్టీ విజయానికి గృహసారథులు కృషి చేయాలి



కాఫీ విత్ గృహసారథి కార్యక్రమంలోవరికూటి దంపతులు

సింగరాయకొండ: గృహ సారథులు తమ విధులను సక్రమంగా నిర్వర్తించి పార్టీ పటిష్టతకు కృషి చేయాలని రాబోయే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు అన్నారు. సోమరాజుపల్లి పంచాయతీ పకీరు పాలెంలో గురువారం ఉదయం గృహసారథి షేక్ దాదా సాహెబ్ ఇంటి వద్ద కాఫీ విత్ గృహసారథి కార్యక్రమంలో వరికూటి మాట్లాడారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యలను తెలుసుకుటున్నామన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యం ప్రకారం రాబోయే ఎన్నికల్లో 175 సీట్లు సాధించే లక్ష్యంగా ప్రతి గృహసారథి తన వంతు కృషి చేయాలన్నారు. మహిళలు మాట్లాడుతూ కాలనీలో ప్రధానంగా డ్రైనేజీ సమస్య ఉందన్నారు. రూర్బన్ పథకం ద్వారా రోడ్లు నిర్మించారే కానీ మురుగుకాలువలు నిర్మించలేదని.. సమస్య పరిష్కరించాలని కోరారు. దీనిపై వరికూటి పంచాయతీరాజ్ ఏఈ శ్రీహరితో మాట్లాడి.. మురుగు కాలువలు నిర్మించాలని సూచించారు. అంతకుముందు కాలనీవాసులు వరికూటి, ఆయన సతీమణి లక్ష్మి దంపతులకు అపూర్వస్వాగతం పలికారు. తమ కాలనీకి సతీసమేతంగా రావటం పట్ల కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు. వైస్ ఎంపీపీ సామంతుల రవికుమార్ రెడ్డి, ఊళ్లపాలెం సర్పంచ్ పాకనాటి అనసూర్యమ్మ, వడ్డేల కార్పొరేషన్ డైరెక్టర్ యనమల మాధవి, మండల సచివాలయాల కన్వీనర్ తన్నీరు సుబ్బారావు, యన్నాబత్తిన చిన్నా, మాజీ ఎంపీపీ యన్నాబత్తిన మురళి, యన్నాబత్తిన కార్తీక్, గ్రామ సచివాలయ కన్వీనర్లు శీలం రమణయ్య, వేల్పుల మాలకొండయ్య, షేక్ సుల్తాన్, షేక్ పటేల్, షేక్ సలీం బాషా, పాకనాటి సుబ్బారెడ్డి, రాజు వెంకటేశ్వర్‌రెడ్డి, షేక్ అబ్దుల్లా పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించండి

సింగరాయకొండ: వైఎస్సార్‌సీపీ మద్దతుతో పోటీలో చేస్తున్న తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యామ్ ప్రసాద్ రెడ్డిని గెలిపించాలని ఇన్‌చార్జి వరికూటి అశోక్ బాబు అన్నారు. సోమరాజుపల్లి పంచాయతీ పకీరుపాలెంలోని ఊళ్లపాలెం సర్పంచ్ పాకనాటి అనసూర్యమ్మ ఇంటివద్ద గురువారం ఉదయం ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో వరికూటి పాల్గొన్నారు. గెలుపు కోసం ఏవిధంగా కృషి చేయాలో వరికూటి గృహసారథులకు దిశానిర్దేశం చేశారు. అంతకు ముందు వరికూటి, ఆయన సతీమణి లక్ష్మిని సర్పంచ్ అనసూర్యమ్మ, కుమారుడు పాకనాటి సుబ్బారెడ్డి సత్కరించారు. మండల సచివాలయ జేసీఎస్ తన్నీరు సుబ్బారావు, మాజీ ఎంపీపీ యన్నాబత్తిన మురళి, గాలిబుజ్జి, రాజు వెంకటేశ్వరరెడ్డి, నరేంద్రరెడ్డి, మాజీ సర్పంచ్ ఆరేటి లక్ష్మీనారాయణ, పురిణి శ్రీనివాసులరెడ్డి పాల్గొన్నారు.

లక్ష్మీ నృసింహస్వామి ఆలయ అభివృద్ధికి కృషి

- రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కుప్పం ప్రసాద్

మద్రిపూడి: పృధులగిరి లక్ష్మీ నృసింహస్వామి ఆలయ అభివృద్ధిలో భాగంగా ఘాట్‌రోడ్‌ను తారురోడ్‌గా అభివృద్ధి చేసేందుకు తమ వంతు కృషి చేస్తామని రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కుప్పం ప్రసాదు గురువారం పేర్కొన్నారు. పృధులగిరి లక్ష్మీనృసింహ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం స్వాములవారిని శేషవాహనం పై ఘనంగా ఊరేగించారు. ఆలయప్రాంగణాన్ని పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడుతూ భక్తులకు తాగునీరు, విద్యుత్ సౌకర్యం అందుబాటులోకి రానున్నట్లు తెలిపారు. భక్తుల స్వాములవారి దర్శినార్థం ఘాట్‌రోడ్ మరమ్మతులు జరుగుతున్నాయన్నారు. సత్రాల వద్ద నుంచి స్వాములవారి గర్భగుడి వరకు దాతల సహకారంతో తారురోడ్ నిర్మించేందుకు ఈ నెల 13 న శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. ఆలయ విస్తరణ పనులు చేపట్టేందుకు రూ. 4 కోట్లు ప్రతిపాదనలు పంపినట్లు పేర్కొన్నారు. ఎంపీపీ వాకా వెంకటరెడ్డి సర్పంచ్ కదిరి భాస్కర్, చిమట సొసైటీ అధ్యక్షుడు మాకినేని వెంకట్రావు, మాచేపల్లి నాగయ్య, ఇనుకొల్లు సుబ్బారెడ్డి, ఇనుకొల్లు మాదిరెడ్డి, కాటూరి ప్రసాద్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కుప్పం ప్రసాద్

కేంద్రాలను సక్రమంగా నిర్వహించాలి

సీఎస్‌పురం: అంగన్‌వాడీ కేంద్రాలను సక్రమంగా నిర్వహించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పార్వతి అన్నారు. స్థానిక వడ్డెపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం సెక్టార్ సమావేశం నిర్వహించారు. ఆయా కేంద్రాల పరిధిలో చిన్నారులు, బాలింతలు, గర్భిణుల వివరాలు, కేంద్రాల ద్వారా అందిస్తున్న పౌష్టికాహరం పంపిణీ తదితర రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్రాల నిర్వహణ వివరాలను ప్రతి రోజూ యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. రికార్డులను సక్రమంగా ఉంచుకోవాలని చెప్పారు. కేంద్రాలకు వచ్చే చిన్నారుల పట్ల తల్లి ప్రేమను చూపిస్తూ వారి అభివృద్ధికి బాటలు వేయాలన్నారు. ఐసీడీఎస్ వెలిగండ్ల ప్రాజెక్టు బీపీఏ శ్యామ్యూల్, సీఎస్‌పురం, డీజీపేట, ఆర్‌కేపల్లి సెక్టార్ల పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళా పోలీసులు ఉన్నత సేవలు అందించాలి

పొన్నలూరు: సచివాలయాల్లో విధులు నిర్వహిస్తున్న మహిళా పోలీసులు ప్రజలకు మంచి సేవలు అందించి ప్రభుత్వ లక్ష్యాలను నెరవేర్చాలని ఎస్సై దాసరి రాజారావు పేర్కొన్నారు. మండలంలోని పాత శింగరబొట్ల సచివాలయంలో రికార్డును పరిశీలించారు. మహిళలపై జరుగుతున్న లైంగిక దాడులు, ఆర్థిక నేరాలు, ఆన్‌లైన్ మోసాలు, దొంగతనాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సదస్సులు ఏర్పాటు చేసి అవగాహన కల్పించాలన్నారు. పలు ప్రదేశాల్లో 16 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. మహిళా పోలీస్ గిరిజా, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



కొత్తశింగరబొట్లపాలెంలో రికార్డును పరిశీలిస్తున్న ఎస్సై రాజారావు

టైలరింగ్‌లో ఉచిత శిక్షణ

టంగుటూరు: గ్రామీణాభివృద్ధి, సవయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో మహిళలకు టైలరింగ్‌లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ ప్రతాప్ రెడ్డి తెలిపారు. మార్చి 6 నుంచి ఏప్రిల్ 4 వరకు ఉచిత శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తారన్నారు. ఇతర వివరాలకు 9573363141 నంబర్‌ను సంప్రదించాలన్నారు.